అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
1
బుధవారం 07 జూన్ 2023

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్
జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠ	కనిష్ఠ
నల్లగొండ	41.5	23.4
సూర్యాపేట	44.8	35.7
యాదాద్రిభువనగిరి	40.6	29.0

రుచికరం... పోషక సమాహారం

- రేపటినుండి ఫిష్ ఫెస్టివల్
- దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు
- మత్స్య సహకార సంఘాలకు తోడ్పాటు

నవతెలంగాణ- నల్లగొండకలెక్టరేట్
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో భాగంగా ప్రభుత్వం విభిన్న చేపల వంటల రుచులను చూపించేందుకు సిద్ధమైంది. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు మృగశిర కార్తె రోజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రేపటి నుండి మూడు రోజులపాటు చేపల ఆహార దినోత్సవం ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నల్లగొండ జిల్లాలో 256 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా వాటిలో 27 పైగా మహిళా సంఘాలు ఉన్నాయి. అందులో 30 మంది మహిళా సంఘం సభ్యులతో వంటకాలను చేపించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే వారికి శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయింది. వివిధ రకాల రుచికరమైన వంటలను తయారు చేయడం ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 20 స్టాళ్లలో చేపలు.. రొయ్యలతో నోరూరించే వంటకాలను అందుబాటులో ఉంచనున్నారు. కార్యక్రమం ద్వారా మత్స్య సహకార సంఘాలు బలపేతం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



విభిన్న రకాల రుచులు...
తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించనున్న ఫిష్ ఫెస్టివల్ లో వివిధ రకాల వంటలను చేయడానికి హైదరాబాదులోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద 30 మంది మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారంతా జిల్లా ప్రజలకు విభిన్న చేపల వంటకాల రుచులను చూపించేందుకు సిద్ధమయ్యారు. ఏర్పాటు చేస్తున్న స్టాళ్లలో చేపల పచ్చళ్ళు, కొరమీను పచ్చళ్ళు, ఫిష్ సమోసా, ఫిష్ సూప్స్, ప్రాన్స్ బిర్యానీ, ప్రాన్స్ పకోడీ, ఫిష్ బర్గర్స్, ఫిష్ పకోడీ, ఫిష్ హాట్ లైట్స్, ఫ్రైడ్ ప్రాన్స్, ఫిష్ ఫింగర్, ప్రాన్స్ బట్టర్ ఫ్రై, ఫిష్ మంచూరియా, స్మోకాయిడ్ తదితర వంటలను చేయనున్నారు.

మేలు చేస్తే చేపలు...
మనం తినే నాన్ వెజ్ తో పోలిస్తే చేపలు ఉత్తమమైనవి. వీటిలో కొలెస్ట్రాల్ తక్కువ. చేపలు తింటే గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటుంది.రక్తంలో ఉండే ట్రై గ్లిజరాయిడ్లను తగ్గించి గుండె జబ్బులను నివారిస్తాయి. తగ్గిస్తాయి. మానసిక రుగ్మతలు దూరం చేస్తాయి. మంచి ఆరోగ్యం కోసం వారానికి రెండు నుండి మూడుసార్లు చేపలను తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వయస్సు మీద పడిన వారికి మతిమరుపు నుండి బయటపడడానికి, మెదడు చురుగా పనిచేసి జ్ఞాపక శక్తిని మెరుగుపరచుకోవడానికి ఇలా అనేక రకాలుగా చేపల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ఇప్పటికే పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

అంతా ఒమేగా త్రిలోనే ఉంది...
ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు ఉంటాయి. వాటితోపాటు ఒమేగా త్రీ ప్యాంటీ యాసిడ్లు ఉంటాయి. కానీ ఇవి పుష్కలంగా చేపలలో మాత్రమే లభిస్తాయి. ఒమేగాత్రి శరీరంలో కొలెస్ట్రాలను తగ్గిస్తుంది. మానవ ఆయుష్షుని పెంచుతుంది.అందుకే చేపలను విరివిగా వాడేవారు అనారోగ్యం పాలు కాకుండా ఆరోగ్యంగా ఉంటారు.

ప్రజలకు అవగాహన ముఖ్యం....
వెంకయ్య - జిల్లా మత్స్యశాఖ అధికారి



మానవాళికి మేలు చేసే చేపల పై ప్రజలకు అవగాహన తక్కువ. వారికి అవగాహన కల్పించేందుకు.. మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. ఎప్పుడు వివిధ రకాల వంటకాల రుచులను చూసే వారు ఈసారి చేపలతో తయారు చేసిన వివిధ వంటకాల రుచులు చూసి ఆస్వాదించాలి. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ రోజే మృగశిర కార్తి రావడం తో ఆరోజు ప్రత్యేకత సంతరించుకుంది.



మారోజు చంద్ర మౌళి ఆశయాలు సాధిస్తాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి

నవతెలంగాణ- నకిరేకల్
పేదల కోసం పోరాడిన మారోజు చంద్ర మౌళి ఆశయాలను సాధిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం శాలిగౌరారం మండలంలోని గురజాల గ్రామం లో చంద్ర మౌళి స్థూపం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం చంద్ర మౌళి నిరంతరం పోరాటం చేశారన్నారు. దున్నేవాడికే భూమి కావాలని, కష్ట జీవులకు కూలి రేట్లు పెంచాలని అనేక పోరాటాల్లో ఆయన ముందున్నారన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్ట్ లు పాలించే కాడ మాత్రమే ప్రజలు సంతోషం గా ఉన్నారన్నారు భవిషత్ తరాలకు కమ్యూనిజమే మార్గదర్శక మన్నరు ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముది రెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందా ల ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకన్న, మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మండల నాయకులు జగన్, మక్కా బూచి రాములు, డెంకల్ లింగయ్య కరింగుల వెంకన్న, సైదుల శీను, సత్య నారాయణ, సీర్పంగీ అంజి, ఎస్.కె ఇస్మాయిల్, చంద్ర రెడ్డి, కొమరయ్య పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించవద్దు
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- కలెక్టర్ టి.వినయ్ క్రిష్ణా రెడ్డి



నవతెలంగాణ -నల్లగొండకలెక్టరేట్
ఈనెల 11న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమినరి పరీక్ష జిల్లాలో సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ క్రిష్ణా రెడ్డి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీఎస్‌పీఎస్‌డీ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షా నిర్వహణ ఏర్పాట్లపై లైజన్ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా కలెక్టర్ టి.వినయ్ క్రిష్ణా రెడ్డి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 11న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో వికలాంగుల కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌకర్యాలను కల్పించాలని, స్ట్రాంగ్ రూం నుండి పరీక్షా కేంద్రానికి, తిరిగి పరీక్షా కేంద్రం నుండి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 51 కేంద్రాల్లో 16095 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్స్ ఉండాలని సూచించారు. లైజన్ అధికారులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్‌లతో కలిసి పర్యటించి,చెక్ లిస్ట్ ప్రకారం పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించాలని అన్నారు.పరీక్షా కేంద్రాల్లో కేటాయించిన సిబ్బందికి ఐ.డి కార్డ్ లు జారీ చేయాలని,ఎవరికి కేటాయించిన విధులు వారే నిర్వర్తించాలని సూచించారు. పరీక్ష సమయానికి ఉదయం 10:15 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో 10:15 తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వాచ్, సెల్ ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని ఆదేశించారు.పరీక్ష కేంద్రాలకు చెప్పులు ధరించి రావాలని, షూస్ వేసుకు రావద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపును నిర్వహించాలని, విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఎదైన ఒరిజినల్ గుర్తింపు కార్డును పాన్ కార్డు మినహా వెంటతీసుకురావాలని సూచించారు. పరీక్షకు ముందు ఒయంఆర్, హాల్ టికెట్ పై బబ్లింగ్ గురించి అభ్యర్థుకు తెలియజేయాలని తెలిపారు. టీఎస్పీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, లైసన్ అధికారులు,సంబంధిత అధికారుల పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

నవతెలంగాణ- సంస్థాన్ నారాయణపురం
ధాన్యం కొనుగోలు చేయాలని, లారీల కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు కాంగ్రెస్ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం యాసింగి పంటను అమ్ముకోవడంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒకవైపు ప్రకృతి వైఫల్యం వల్ల వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. మండలంలో మే నెలలో కొనుగోలు ప్రారంభించినప్పటికీ నేటికీ 50శాతం కొనుగోలు జరగలేదన్నారు. 50శాతం ధాన్యం మార్కెట్ లల్లోనే ఉందన్నారు. ఎల్లర్లు తేమ, తాలు, ముక్కపాయ పేరుతోటి కింటాల్‌కు 2 నుంచి 3 కిలోలు తరుగు తీస్తున్నారన్నారు. గుజ్జ పీఏసీఎస్ చైర్మెన్ దొడ యాదిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని సర్వేలు,పుట్టపాక,చిల్లాపురం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వారి ధాన్యం తరలించడంలో అధికారులు కావాలని లారీల కొరత సృష్టిస్తున్నారన్నారు. తూకం వేసిన బస్తాలు చెదలు పట్టి చినిగిపోతున్న తరలించడం లేదన్నారు. వారానికి ఒక లారీ తరలిస్తే ఎన్నడు పూర్తయితాయన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి గుంటోజి శ్రీనివాస్ చారి, ఫార్మర్ సొసైటీ అధ్యక్షులు పల్లె పుష్పారెడ్డి, పుల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ,ఏపూరి సతీష్,బొమ్మగొని శంకరయ్య,యాదిరెడ్డి, గుజ్జ బ్యాంక్ డైరెక్టర్ లు,విరమల్ల లింగయ్య, పగిళ్ళ యాదయ్య, వార్డు సభ్యులు వర్ధం శేకర్, వెలిజాల సుందరయ్య,బద్దుల వెంకటేష్,జనిగాల నర్సింహా,గంగాదేవి బిక్షపతి వివిధ రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్
పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి కొరకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు.తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యాపేట పరిధిలోని సువెన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో పరిశ్రమల శాఖ జీఎం తిరుపతయ్య అధ్యక్షతన నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యాక్రమంలో కలెక్టర్ ,అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అనంతరం మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు.తెలంగాణ ఆవిర్భావం అనంతరం పరిశ్రమలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రపంచంలో అన్ని రంగాల్లో తెలంగాణ పోటీ పడుతుందన్నారు. టీఎస్ ఐ పాస్ ద్వారా



పారిశ్రామిక ప్రగతి పురోగతి సాధిస్తుందని చెప్పారు.నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమలకు అధునాతన మౌలిక సదుపాయాలను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా సింగిల్ విండో ఏర్పాటు చేసి నెలరోజుల లోపే పరిశ్రమలకు అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. తెలంగాణలో మీసేవాల ద్వారా అనేక మార్పులకు చోటు చేసుకుందని, మీసేవా ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను 96శాతం ధరణిలో పరిష్కరించబడిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీల ద్వారా యువతకు అనేక ఉపాధికల్పన కల్పిస్తుందని తెలిపారు.అనంతరం వివిద రంగాల పారిశ్రామిక వేత్తలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గఫార్, సుధాకర్ పీవీసీ చైర్మెన్ మీలా మహదేవ్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమనర్సయ్య, మీసేవ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, సువెన్ ఫార్మా వైస్ ప్రెసిడెంట్ కేవి శేషగిరిరావు, టీజేరాయుడు, వెంకటొరెడ్డి, టి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఇండ్లు దగ్ధం

నవతెలంగాణ-మిర్యాలగూడ
విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇండ్లు దగ్ధమైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది.మండలంలోని కిష్టాపురం గ్రామపంచాయతీ అజ్మీరతండాలోని కూలి పని చేసుకుంటూ జీవించే ధీరావత్ లక్ష్మి ఇండ్లు మంగళవారం ఉదయం వీచిన ఈదురుగాలతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి పూర్తిగా కాలిపోయింది.ఇంట్లోని వస్తువులు, సామగ్రి,బట్టలు, టీవీ,ఫ్రిజ్ కాలిపోయాయి.సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.కూలి నాలి చేసుకునే జీవించుటకు ఇండ్లు దగ్ధం కావడం వల్ల పూర్తిగా నష్టపోయానని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.ధీరావత్ లక్ష్మీ ఇండ్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయిందన్న సమాచారం తెలుసుకున్న సామాజికవేత్త మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి వచ్చి బాధితులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.





పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-నేరేడుచర్ల
ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇంటిస్థలాలు మంజూరు చేసి,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్లు 243,244,253,250,358, 479 గల భూములలో పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి,పట్టాలు అందించాలని నిరుపేదల సంఘం ఆధ్వర్యంలో 97 రోజులుగా చేస్తున్న దీక్షకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయలకు ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు అమ్ముకుంటుందని ఆరోపించారు. ప్రభుత్వస్థలాన్ని పేదలకు ఆక్రమించుకొని తాత్కాలిక నివాసాల కోసం కర్రలు పాతి అక్కడే వంటావార్పు చేస్తున్నా ప్రభుత్వ స్పందించకపోవడం శోచనీయమన్నారు.ఇండ్ల స్థలాలు కేటాయించాలని పేదలు ఐదేండ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.పేద వర్గాల ప్రజలు అధికార పార్టీ ఎమ్మెల్యేకు, స్థానిక రెవెన్యూ అధికారులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.పల్లె ప్రకృతి వనం,శ్మశానవాటికల పేరుతో పేదల అసైన్డ్‌భూములను బలవంతంగా గుంజుకుంటున్న ప్రభుత్వం, పేదలకు మాత్రం ఇండ్లస్థలాలు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు.ఆధిపత్య పార్టీలకు ఓట్లేసి గెలిపిస్తే పేదల కష్టాలు పట్టవన్న ఆయన వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలతో పాటు కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, జిల్లా ఇన్‌చార్జీలు చాడపంగ రవి,రాపోల్ నవీన్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షులు మంద రవి, నేరేడుచర్ల బీఎస్పీ నాయకులు,నిరుపేద సంఘం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందితో లక్ష హారతి

- వినూత్నంగా సాగునీటి దినోత్సవం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్
కాళేశ్వరం జలాలతో తొలిసారిగా లబ్ది పొందిన సూర్యాపేట జిల్లా రైతాంగం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు గాను రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా రైతాంగం వినూత్న మార్గాన్ని ఎంచుకుంది.రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సావాలలో భాగంగా ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన సాగునీటి దినోత్సవాన్ని కాళేశ్వరం జలాలతో లక్షహారతి పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.కాళేశ్వరం జలాలు పారే ఏడూ మండలాల్లోని 126 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.నాగరం మండలం ఈటూరు నుండి పెన్పహాడ్ మండలం రావి చేరువు వరకు 68 కిలో మీటర్ల బారునా లక్ష మందితో కాళేశ్వరం జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.అందుకు అవసరమైన ఏర్పాట్లకుగాను మంగళవారం సాయంత్రం సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,నీటి పారుదల అధికారి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం తో పాటు ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.68 కిలోమీటర్ల దారి పొడవునా లక్ష మందితో సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించ తలపెట్టిన కాళేశ్వరం జలాలకు లక్ష హారతి



కార్యక్రమం బొడ్డు రాయి పండగను మరిపించేలా ఏర్పాట్లు చేసేలా అధికారులను మంత్రి ఆదేశించారు.ప్రతి పావు కిలో మీటరుకు ఒకరు చొప్పున 280 మంది ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం అడుగడుగునా వైద్య బృందాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగాన్ని రంగంలోకి దింపగా ఎక్కడి కక్కడే పూర్తి స్థాయిలో భోజనాలు ఏర్పాటు చేశారు.మంచినీటి ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.ఇప్పటికేబతుకమ్మ ,బోనాలతో మంగళవాయిద్యాలతో ఊరు వాడ కదిలేలా కాళేశ్వరం జలాలతో లబ్ది పొందిన రైతాంగం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.కాళేశ్వరం జలాలతో మొట్ట మొదట లబ్ది పొందిన సూర్యాపేట జిల్లా యావత్ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ధన్యవాదాలు చెప్పుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎక్కడి వారు అక్కడే పాల్గొనసుండగా సూర్యాపేట నియోజకవర్గంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ,తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్, కోదాడ నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగు లింగయ్యయాదవ్, కలెక్టర్ ఎస్.వెంకట్రావు, జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నార్కట్ పల్లి - మండ్రా రహదారి నరక యాత్రనే

- నిధులు మంజూరైన... నిర్లక్ష్యమే..
- 10 సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

మల్లెబోయిన రామలింగం

- ఈ రహదారిపై ప్రయాణం ప్రాణాంతకం

తరాల పద్మ

- టెండర్ పక్రియ పూర్తి అయింది.. పనులు చేయాల్సి ఉంది
- పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పాల మోహన్

నవతెలంగాణ - నార్కట్‌పల్లి

అభివృద్ధికి చిహ్నాలు రహదారులు.. ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉంటే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అనేది నానుడి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం పూర్తి అయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న తరుణంలో మండల పరిధిలోని మాండ్ర గ్రామానికి నార్కట్ పల్లి మండల కేంద్రం నుంచి వెళ్లాల్సిన రహదారి అత్యంత దారుణంగా గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారింది . రవాణా వ్యవస్థ లేకపోవడంతో చక్రవాహనాలపై వెళ్లి కిందపడి ఆరోగ్య సమస్యలు తెచ్చుకున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితిపై గ్రామస్తులు గత పది సంవత్సరాలుగా ఆ గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆందోళనలు చేసి ,మొర పెట్టుకోవడంతో నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణం నరకయాతనే.

నిధులు మంజూరైన... నిర్లక్ష్యమే

మండల పరిధిలోని మాండ్ర గ్రామానికి నార్కట్ పల్లి మండల కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరం బ్లాక్ టాప్ రోడ్డును గత 12 సంవత్సరాల క్రితం నిర్మించారు. నిర్మాణం జరిగిన కొద్ది రోజులకి ఈ రహదారి మొత్తం ధ్వంసం అయింది. మండ్ర గ్రామ శివారులో సోలార్ పరిశ్రమ ఏర్పాటు భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిస్థాయిలో ధ్వంసమై కంకర తేలి ప్రమాదకరంగా మారింది దీంతో అధికారులు రోడ్డు నిర్మాణానికి రూ 82 లక్షల రూపాయలను మంజూరు చేశారు పనులు వేగవంతం చేసేందుకు అధికారులు ఇప్పటికే టెండర్ ప్రక్రియను సైతం పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ పనులు ప్రారంభం కావడం లేదు. దేవుడు వరమిచ్చిన పూజారి కనికరించినట్లు అన్న చందంగా రహదారి నిర్మాణానికి గుత్తా తీసుకున్న కాంట్రాక్టర్ అతని వేరే పనుల్లో నిమగ్నమై పట్టించకపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం ఆ గ్రామస్తులకు ప్రాణగండంగా మారింద ని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



10 ఏండ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
మల్లెబోయిన రామలింగం

గత 12 సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మాణం చేసిన కొద్ది రోజులకే గ్రామ శివారులో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఈ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలతో రోడ్డు ధ్వంసమై 10 సంవత్సరాలుగా నరకయాతన అనుభవిస్తున్నాం ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ రహదారిపై ప్రయాణం ప్రాణాంతకం
తరాల పద్మ

నార్కట్పల్లి మండ్ర రహదారి పై ప్రయాణం ప్రాణాంతకంగా మారింది మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు అడపాదడపా నడిచే ఆటోల్లో ప్రయాణం చేస్తే కడుపులో పేగులు గొంతులోకి వచ్చే విధంగా వాహనాలు ఎత్తేస్తుంటాయి. తమ ఆరోగ్య పరిస్థితి బాగాలేక ప్రతి వారం ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సి వచ్చినప్పుడు ఈ ప్రయాణంతో నడుము నొప్పి వచ్చేసింది. వెంటనే ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి కాంట్రాక్టర్ తో పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

టెండర్ పక్రియ పూర్తి అయింది.. పనులు చేయాల్సి ఉంది
పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పాల మోహన్

నార్కట్ పల్లి -మండ్ర గ్రామానికి 7 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం 82 లక్షల రూపాయలు మంజూరు చేసింది ఇప్పటికే టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్యారా క్రీడాకారుల నుండి దరఖాస్తులు

నవ తెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

జిల్లా స్థాయిలో ప్యారా ఖేలో ఇండియా సెంటర్ నిర్మించడం కోసం జిల్లాకు చెందిన 40 ఏండ్ల లోపు వయసు కలిగిన సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎండి. మక్బుల్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, సైక్లింగ్, ఫెన్సింగ్, హాకీ, జూడో,రోలింగ్, షుటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, క్రీడలలో ప్రావీణ్యం పొందిన సీనియర్ ప్యారా క్రీడాకారులు ఈనెల 16 లోగా జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9866317321ను సంప్రదించాలని తెలిపారు.



చంద్ర రాజేశ్వరరావు ఆదర్శప్రాయుడు

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

దేశవ్యాప్తంగా భూ పోరాటాలకు నాయకత్వం వహించి చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా భూ పోరాటాలు నిర్వహించిన ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు జీవితం ఆదర్శప్రాయమైనదని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం ఆ పార్టీ నల్గొండ జిల్లా కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశంలో లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ప్రజానాయకుడు చంద్ర రాజేశ్వరరావు అని దేశంలో విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన మహా నాయకుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. శ్రావణ్ కుమార్,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్, పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్,విశ్వనాథుల లెనిన్, ముండ్ల ముత్యాలు, శాకినాల అంజయ్య,పద్మ, సూర్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజూ కొనసాగిన వేలం

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్షిప్ 5 వ విడత వేలం లో బాగంగా ఓపెన్ ప్లాట్ లు,పాక్షిక నిర్మాణ గృహలకు రెండవ రోజూ వేలం నిర్వహించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉదయాదిత్య భవన్ లో మంగళవారం నిర్వహించిన భౌతిక వేలంలో 2 ఓపెన్ ప్లాట్ లు భౌతిక వేలం ద్వారా విక్రయించారు. ఈ రెండు ఓపెన్ ప్లాట్ ల ద్వారా ప్రభుత్వానికి రూ.36 లక్షల 66 వేల రూపాయలు ఆదాయం సమకూరనున్నట్టుతెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉదయాదిత్య భవన్లో రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్షిప్ ఓపెన్ ప్లాట్ లకు,పాక్షిక నిర్మాణ గృహాలకు భౌతిక వేలం నిర్వహిస్తారు. ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ పి.డి.రాజ్ కుమార్, స్వగృహ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సయ్యద్ షఫియోద్దీన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి పాండు, తదితరులు పాల్గొన్నారు.

సుంకిశాలలో బడిబాట కార్యక్రమం

నాంపల్లి:మండలంలోని సుంకిశాల గ్రామంలో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సుమతమ్మ గ్రామంలో పిల్లల తల్లిదండ్రులను కలిసి అంగన్వాడీ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఒక పూట ఉచిత భోజనం, రోజుకు ఒకగుడ్డు, ఆకుకూరలతో పప్పు, సాయంత్రం మురుకులు పిల్లలకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లులు, కిషోర బాలికలు, గ్రామపెద్దలు, ఆయా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి పరామర్శ

నవతెలంగాణ -నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దీకొండ ధనమ్మ భర్త ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యారు మంగళవారం టి పి సి సి రాష్ట్ర మాజీ కార్యనిర్వాక కార్యదర్శి దైద రవీందర్ ప్రమాద బాధితుని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు యం.డి యూసుఫ్ , యూత్ కాంగ్రెస్ నాయకులు చెనగోని రాజశేఖర్ గౌడ్ , మాచర్ల శేఖర్ , చెరుపల్లి సైదులు , ధనమ్మ , నల్గొండ మహేష్ , నల్గొండ సాయి , వంటెపాక సతీష్ , వంటెపాక్ నక్షత్ , నర్సింగ్ మహేష్ , మధు , దైద సురేష్ , పశుపతి , రఘుపతి , వెంకటేష్ పాల్గొన్నారు.

సరళీకృత విధానాల ద్వారా కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్



రాష్ట్ర ప్రభుత్వం సరళీకృత విధానాల ద్వారా కొత్త పారిశ్రామిక సంస్థల స్థాపనకు అనేక రకాల ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు నల్లగొండ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి వివరించారు. మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఎన్ఆర్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 'తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవ కార్యక్రమాన్ని శాసన సభ్యులు నోముల భగత్,రవీంద్ర కుమార్,జిల్లా కలెక్టర్ టి.వినయ్ క్రిష్ణా రెడ్డి,మున్సిపల్ చైర్మన్ ఎం. సైది రెడ్డి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు..ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. 2014 ముందు కరెంటు కష్టాలతో అనేక పరిశ్రమలు, చేనేత, జౌళి శాఖ పరిశ్రమలు మూతపడ్డాయని,కార్మికులు రోడ్డున పడి ఉపాధి కోల్పోయారని ఆయన తెలిపారు. కానీ నేడు 24 గంటలు కరెంట్ సరఫరాతో చేనేత పవర్ లూం పరిశ్రమలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రం ఏర్పాటు తర్వాత టీఎస్ఐపాస్ చట్టం కింద నల్గొండ జిల్లాలో కొత్తగా 608 పరిశ్రమలు స్థాపించినట్లు తెలిపారు. నేత కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఐదు లక్షల బీమా అందజేస్తున్నట్లుతెలిపారు. కొన్ని వర్గాల ప్రజలకు పరిశ్రమల స్థాపనలో భాగంగా విద్యుత్తును సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధి సంక్షేమ పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా ఉన్నామన్నారు. జిల్లాలో రైస్ మిల్లులు, సిమెంట్ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు స్థాపించారని తెలిపారు. నూతనంగా ఐటి టవర్ ను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కేటీఆర్ సహకారంతో కృషి చేస్తున్నామనితెలిపారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు నోముల భగత్ మాట్లాడుతూ రాష్ట్రానికి జాతీయ అంతర్జాతీయ సంస్థలు టీఎస్ ఐపాస్ ఆన్లైన్ ద్వారా పారిశ్రామిక సంస్థలు అనుమతులు తీసుకొని తమ సంస్థలను స్థాపించాయని తెలిపారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రం లో మిర్యాలగూడలో రెండు చోట్ల పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతాంగం ఎక్కువగా వ్యవసాయం చేసి పంట ఉత్పత్తిని పెంచారని, ఆ పండించిన పంటను రైస్ మిల్లులు పంటకు అనుగుణంగా జిల్లాలో పారిశ్రామికవేత్తలు రైస్ మిల్లులు ప్రారంభించారని తెలిపారు. చేనేత కార్మికులు విధిగా చేనేత భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు, ఇన్నోవేటర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల శాఖ,చేనేత, జౌళి శాఖ తమ ఉత్పత్తు లపై ఎగ్జిబీషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అర్.మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం. సైదిరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, ఎంపీపీలు విజయలక్ష్మి, కరీం పాషాలు,పరిశ్రమల శాఖ జి ఎంకోటేశ్వర రావు, చేనేత,జౌళి శాఖ ఏడి ద్వారక్, వంగాల సహదేవ రెడ్డి, జిల్లా బిక్షం, పున్న గణేష్, పూజిత శ్రీనివాస్, మిర్యాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచిగా పారిశ్రామిక రంగం



- ఉపాధి కల్పించడంలో తెలంగాణ అగ్రస్థానం
- పారిశ్రామిక ప్రగతి దినోత్సవంలో గుత్తా, భాస్కరరావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

దేశానికి దిక్సూచిగా తెలంగాణలోని పారిశ్రామికరంగం నిలిచిందని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు.పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం పారిశ్రామిక ప్రగతి దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ఉమ్మడి రాష్ట్రంలో పారిశ్రామికరంగం మూతపడిందని.. తెలంగాణ వచ్చాక అనేక పరిశ్రమలు నెలకొల్పి వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు.ప్రపంచంలోనే పేరు మోసిన అనేక కంపెనీలు హైదరాబాదులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని చెప్పారు.ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి కేటీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.నిత్యం పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నారని చెప్పారు.అనేక ప్రముఖ కంపెనీలు తీసుకురావడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారన్నారు.హైదరాబాద్ కేంద్రంగా అనేక కంపెనీలు నెలకొల్పుతున్నారని హైదరాబాద్ చుట్టూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.రూ.వేలాదికోట్లతో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మిస్తున్నామని, వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అందుతుందని తెలిపారు.ఈ డిసెంబర్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటు ప్రారంభం చేయబోతున్నామని వచ్చే ఏడాదికి యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రారంభం చేసుకుంటుందని తెలిపారు.రూ.1000 కోట్లతో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు.రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగిందని దేశంలోనే పారిశ్రామికరంగం ప్రగతిపథంలో సాగుతుందని చెప్పారు.నిరుద్యోగులు ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఆర్డీఓ చెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేశ్, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గౌరవ శ్రీనివాస్‌వెంకటరమణచౌదరి, జెడ్పీ కోఆప్షన్‌సభ్యులు మోసిన్‌అలీ, ఎంపీపీ నూకల సరళ హనుమంతురెడ్డి,ఇండియా సిమెంట్ ప్రతినిధి సుధీర్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు పాల్గొన్నారు.

కర్నాటి శ్రీనివాసుకు జిల్లా ఉత్తమ చేనేత కార్మికుడి అవార్డు

- నల్గొండలో ఎమ్మెల్యేల చేతులు మీదుగా అవార్డు అందజేత

నవతెలంగాణ - చండూర్



చండూరు కు చెందిన కర్నాటి శ్రీనివాసులు జిల్లా ఉత్తమ చేనేత కార్మికుడిగా అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నల్గొండలో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో భాగంగా అవార్డును ఆయనకు అందజేశారు. ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, రవీందర్ నాయక్, నోముల భగత్ , అధికారులు కలిసి అవార్డును ఆయనకు అందజేయడం జరిగింది. చేనేత కార్మికుడిగా రాణిస్తూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. తనకు అవార్డు రావడం పట్ల చాలా సంతోషంగా ఉందని తనపై మరింత బాధ్యత పెరిగిందని కార్మికుల కు ప్రభుత్వ పథకాలను చేరవేయడంతో పాటు కార్మికుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా కర్నాటి శ్రీనివాసులు వెల్లడించారు. ఈయన చేనేత కార్మికుడే కాకుండా చేనేత సహకార సంఘానికి రెండు పర్యాయాలు డైరెక్టర్ గా సేవలందించి మూడో పర్యాయం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అవార్డుకు రావటం పట్ల స్థానికులు పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటమ్మ



కట్టంగూరు : మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ తవిటి వెంకటమ్మ సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షురాలుగా పనిచేస్తున్న ఆమె మంగళవారం జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆఎన్నికయ్యారు.జిల్లా కమిటీలో మండలానికి చెందినచౌగోని ధనలక్ష్మి,ఊటుకూరి పార్వతమ్మ, భూపతి రేణుక, జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు అభినందనలు తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని వెంకటమ్మ తెలిపారు



ఆలయాల్లో వరుస దొంగతనాలు

- రూ.5 లక్షల విలువైన సొత్తు చోరీ
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

హిల్‌కాలనీలోని డౌన్‌పార్క్ వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు.ఆలయం తలుపుల తాళం పగలగొట్టి రెండు వెండి కిరీటాలు,బంగారపు అమ్మవారి మంగళసూత్రం, బంగారపు నేత్రాలు,ముక్కు పుడక,దాతలు సమర్పించిన 750 గ్రామ్స్ వెండి నేత్రాలు,హుండీని పగలగొట్టి రూ.60 వేల నగదును దోచుకున్నట్లు ఆలయకమిటీ చైర్మెన్ రామ్మోహన్‌రావు తెలిపారు.దాదాపు రూ.5 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారు.ఆలయంలో ఈచోరీ వ్యవహారం నాగార్జునసాగర్‌లో సంచలనం కలిగించింది.మంగళవారం ఉదయం 7గంటల ప్రాంతంలో గుడిఆవరణ శుభ్రం చేయుటకు తలుపులు తీద్దామని వచ్చిన ఆలయకమిటి సభ్యుడు నర్సింగ్ చోరీ జరిగిన విషయం గమనించి ఆ వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయాన్ని పరిశీలించగా గుడిమెయిన్ ద్వారం తాళాలు కోసి ఉన్నాయి.బలమైన ఆయుధాలు ఉపయోగించి తాళాల గడియలను కోసివేశాడు.ఆతర్వాత గర్భ గుడిలోకి వెళ్లి అమ్మవారి విగ్రహంపై ఉన్న మంగళ సూత్రం, రెండు కిరీటాలు, నేత్రాలు తీసుకుని పరారయ్యాడు. క్లూస్ టీంలను రంగంలోకి దిగి వేలిముద్రలను సేకరించారు.ఆలయ కమిటీ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరుస చోరీలతో అలజడి

నాగార్జునసాగర్‌లోని ఆలయాల్లో వరుస దొంగతనాలతో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.పైలాన్‌కాలనీలోని పోచమ్మ ఆలయం,కోదండ రామాలయం,హిల్‌కాలనీలోని అయ్యాప్ప,వినాయక అలయాల్లో నగలు, హుండీ ఎత్తుకుపోయిన ఘటన మరువక ముందే తాజాగా ముత్యాలమ్మ ఆలయంలో భారీ చోరీ జరిగింది.ఇలా వరుస దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

నిఘాను ముమ్మరం చేయాలి...స్థానికులు

ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి ఆనుకొని ఎర్త్ డ్యాం ఎస్పీఎఫ్ సిబ్బంది, పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థలు ఉన్నప్పటికీ ఈ మధ్యకాలంలో తరచుగా ఆలయాలను టార్గెట్ చేసుకొని సునాయాసంగా, పోలీసు వ్యవస్థలపైన ఎటువంటి భయం లేకుండా తెగబడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.సాగర్‌లో కొత్తవారు సంచరించడంపై నిఘాను ముమ్మరం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు.అంతేకాకుండా అర్ధరాత్రి సమయంలో ఆకతాయిలను, మందుబాబులను సంచరించకుండా వారి ఆగడాలకు అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు.

దొంగతనాలను అరికట్టాలి
రామ్మోహన్,ఆలయకమిటీ చైర్మెన్

నాగార్జునసాగర్‌లోని ఆలయాల్లో జరుగుతున్న వరుస దొంగతనాలను అరికట్టాలి.మరో నెలరోజుల వ్యవధిలో బోనాలజాతర ఉత్సవాలు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో దొంగతనం జరగడం బాధాకరం.దొంగతనాలకు పాల్పడిన దొంగలను పోలీసులు వెంటనే గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలి.

వృద్ధునికి ఆర్థికసాయం అందజేత

పెద్దవూర:మండలంలోని నాయనవానికుంట గ్రామానికి చెందిన మేకలలక్ష్మయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.విషయం తెలుసుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త, వైష్ణవి కన్‌స్ట్రక్షన్ చైర్మెన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మంగళవారం బాధితుని ఇంటికి విచ్చేసి రూ.5 వేల ఆర్థికసాయం , అదే గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న కత్తిగోవిందరెడ్డికి రూ.5 వేలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.వారి వెంట తిరుమలగిరి సాగర్ వైస్ఎంపీపీ ఎడవెల్లి దిలీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వినయ్‌రెడ్డి, పెద్దవూర ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ జానివెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ విక్రమ్‌రెడ్డి, వెంకన్న, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

దళిత అడబిడ్డ పెండ్లికి ఆర్థికసాయం అందజేత

పెద్దవూర:మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన కట్ట నాగయ్య చెన్నమ్మ దంపతులకు మూడవ కూతురు మంజుల వివాహానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని మంగళవారం బీజేపీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితరెడ్డి అనివార్య కారణంగా రాలేకపోవడంతో మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, మండల టీమ్ ఆధ్వర్యంలో తన వంతుగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అంతేగాక ఆ గ్రామ నాయకులు కిషన్ మోర్చా అధ్యక్షుడు నులక వెంకటరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సల్వాది గోవిందు కలిసి 75 కిలోల బియ్యం వారి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ గిరిజన మోర్చా కన్వీనర్ పాల్తీ శంకర్‌నాయక్, జానపాటి నాగయ్య, కట్టబోయిన అంజి, కట్ట నరేష్, మల్లయ్య, తులసీ, విజయలక్ష్మీ, రాధ, వెంకన్న, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలు

నవతెలంగాణ-నేరేడుచర్ల

ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలని పెంచికల్‌దిన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరికొండ అనిల్‌కుమార్ అన్నారు.మంగళవారం గ్రామంలోని మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడారు.ప్రభుత్వపాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.మనఊరు- మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సామాజిక స్పృహతో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారవుతారని పెంచికలదిన్నె గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పెద్దఎత్తున చేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరవాణిశ్రీరామ్మూర్తి,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ మేకల సావిత్రి,పాఠశాల ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, యాదయ్య, శ్యామ్‌ప్రసాద్, అంగన్వాడి టీచర్లు సుగుణ, సైదమ్మ షాహిన్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిని వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ వ్యవసాయ కాలాన్ని ఒక నెల ముందుగానే ప్రారంభించాలని వ్యవసాయ శాఖ ద్వారా, ప్రభుత్వం అధికారుల ద్వారా ప్రచారం చేస్తుండడం హర్షించదగిన విషయమేనని ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ అన్నారు.మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేసినట్టయితే వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయన్నారు.ప్రభుత్వం ఆశించిన విధంగానే పంట కాలం ఒక నెల ముందుకు జరుగుతుంది దీనివలన రబీలోపంట కాలం కూడా ఒక నెల ముందుకు జరగటం వల్ల మార్చికే వరి కోతలు పూర్తి అవుతాయని తెలిపారు.వేసవిలో అకాలవర్షాల వల్ల రైతులు పంటలు నష్టపోయే ప్రమాదం ఉండదన్నారు.నీరు విడుదల చేయకుండా ఆయకట్టు పరిధిలోని రైతులు పనులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు.నాసిరకం వరివిత్తనాలు సరఫరా కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జక్కుల మల్లయ్య ,చింతకాయలరాము,కస్తాల సైదులు, రాము,తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఈనెల 7వ తేదీ నుండి కులవృత్తుల వారు రజకులు,నాయీబ్రాహ్మణులు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణులు తదితర కులవృత్తులపై ఆధారపడి జీవించేవారు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థికసాయం కోసం ఈనెల 7వ తేదీ నుండి మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.దరఖాస్తుదారులు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు,బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు,పాస్‌ఫొటో తీసుకొని మీసేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



అంగన్వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్వాడీసెంటర్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ కోరారు.మంగళవారం స్థానిక 45వ వార్డులో నవత ట్రాన్స్‌పోర్టు పక్కన గల అంగన్వాడీ సెంటర్‌లో బడిబాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.నాలుగేండ్లలోపు చిన్నారులను అంగన్వాడీ సెంటర్లకు పంపించాలన్నారు.సెంటర్లలో పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్, అంగన్వాడీ టీచర్ మల్లీశ్వరి, త్రివేణి,సంగీత, సంధ్య, ఉమామహేశ్వరి, పద్మ మనస్విని, జ్యోతి, హేమలత, కుక్కడపు భిక్షం, కల్యాణ్ పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఎస్పీ,ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజు మాదిగ అధ్యక్షతన మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్నమాదిగ,ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజన్నమాదిగ మాట్లాడారు.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై మహాజన నేత మందకృష్ణమాదిగ పిలుపుమేరకు ఈనెల 11న యాదాద్రి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో శివ సాయిఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా మహాసభ జరగనుందన్నారు.సభకు ముఖ్య అతిథులుగా సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు.అందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సుదీర్ఘకాలంగా సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ హామీలు ఇచ్చి వర్గీకరణ సమస్యను అటకెక్కిస్తున్నారని పాలకులు ద్రోహం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు యలమర్తి రాముమాదిగ, జిల్లా నాయకులు కొత్తపల్లి అంజయ్యమాదిగ, మండల ఇన్‌చార్జీలు లంజపల్లిశ్రీను, బొడ్డు కుటుంబరావు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొదటి వార్షికోత్సవ కృతజ్ఞత ఆరాధన వేడుకలు

నవతెలంగాణ-నాగారం

మండలపరిధిలోని ఫణిగిరి గ్రామంలోని బిషప్ ప్రభుదాస్ మెమోరియల్ కమ్యూనిటీ దేవాలయ పున ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవ కృతజ్ఞత ఆరాధన వేడుకలు మంగళవారం స్థానిక సంఘ కాపరి జి.రత్నాకర్, సంఘంసభ్యుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.మొదటి వార్షికోత్సవ కృతజ్ఞత ఆరాధనలో భాగంగా గ్రామంలోని సీఎస్ఐ సంఘ సభ్యులు,వారి బంధువులు అత్యధికంగా హాజరయ్యారు.సంఘ కాపరి, ఆలేరు ఫణిగిరి గ్రూప్ పాస్టర్స్ ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.తదనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు.ఈ కార్యక్రమంలో రెవ అమృతరావు, గ్రూప్ చైర్మెన్ రెవ.పురుషోత్తం,వినీల్‌జాయ్, గ్రూప్ సెక్రెటరీ కడారి సోమయ్య, పాస్టేట్ సెక్రెటరీ జక్కుల రాజు, ట్రెజరర్ ముదిగొండ లాజర్, సంఘ పెద్దమనిషి కర్నె మాణిక్యం, సంఘసభ్యులు యాటభాస్కర్, చిలుకూరు సామేలు,గోరంట్లలక్ష్మయ్య, చిలుకూరి వెంకన్న, ఏరు ఏసేపు,యాట వినోద్, ముదిగొండకలమ్మ, గోరంట్ల జయమ్మ, మరియమ్మ,కర్నె ధనమ్మ, సంగిశెట్టి ఉపేంద్ర,సంగెం యాదమ్మ, ఏరు గీత, పరిమళ, యాటవసంత,చిలుకూరి సారమ్మ, యాటమంజుల, గొడిశాల కల్పన, భాషమల్ల స్వరూప, చిలుకూరికవిత,శ్రీలత, గొడిశాల అరుణ, ముల్కమాధవి, కరుణ, యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ సాగర్ ఆయకట్టుకు మరమ్మతులు చేపట్టాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు వేగంగా నాణ్యతతో చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం)మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ ఏరియా ఎక్కువశాతం ఆయకట్టు సాగర్ నీళ్లపైనే ఆధారపడి ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తు వరినాట్లు వేయాలని సూచనలు చేయడంతో ఆయకట్టు పరిధిలో కాల్వ మర మ్మతులు నాణ్యతతో వేగంగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.దిగువన రైతాంగానికి సాగర్ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలల్లో ప్రభుత్వ భూములను సేకరించి ఇండ్ల స్థలం లేని వారికి స్థలం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోసనబోయిన హుస్సేన్, మండల కమిటీ సభ్యులు తంగెళ్ల వెంకటచంద్ర, షేక్ ఖాశీం, వెల్లంశెట్టి వీరస్వామి, చింతకుంట్ల వీరయ్య, చందాల భిక్షం, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, మాటూరి నర్సింహాచారి పాల్గొన్నారు.



దళితబంధులో అవినీతి జరగలేదు

- ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

దళితబంధు పథకంలో అవినీతి జరగలేదని ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి అన్నారు.మంగళవారం మండలపరిధిలోని గుడిబండ గ్రామంలో ఎంపీపీ నివాసంలో గ్రామానికి చెందిన దళితబంధు లబ్దిదారులతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు.నల్లగొండ ఎంపీ ఉత్తంకుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలను ఖండించారు. గుడిబండ గ్రామం దళితబంధు పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైనప్పటికీ నా స్వార్థం కోసం లబ్దిదారులను ఎంపిక చేయలేదన్నారు. పార్టీ కార్యకర్తలను,తన గెలుపునకు కృషి చేసిన వారిని కూడా పక్కకు పెట్టి



ఇతరపార్టీలలోని పేద వారికి దళితబంధు అందజేశామన్నారు.దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న తనపై పనిగట్టుకుని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి కావాలని గ్రామంలోని కొంతమంది లబ్దిదారులను బెదిరించి ఆరోపణలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆరోపణలు చేసిన లబ్దిదారుల్లో ఒకరైన సిద్దయ్య సోమవారం ప్రెస్‌మీట్ ముగిసిన అనంతరం నా వద్దకు వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో కాంగ్రెస్ వారు కొంతడబ్బు ఆశ చూపడంతో మీపై ఆరోపణలు చేశామని అవన్నీ అవాస్తవాలను చెప్పేందుకు మంగళవారం ప్రెస్‌మీట్‌కు వస్తానని చెప్పాడన్నారు.కానీ మరలా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన సమయానికి ఫోన్ చేసి నాకు రూ.12 లక్షల నగదు కావాలని అవి ఇస్తే మీకు అనుకూలంగా ప్రెస్ మీట్‌లో చెబుతానని చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇలా మాట మీద నమ్మకం లేని వారిని పట్టుకుని మాపై ఆరోపణలు చేయడం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.నా పిల్లల సాక్షిగా మీరు వారికి డబ్బులు ఇచ్చి మేళ్లచెరువు నుండి హుజూర్‌నగర్ తీసుకెళ్లి అక్కడ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తామని చెప్పి తిరిగి మరలా కోదాడకు చేర్చి కోదాడలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి ఆరోపణలు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రమాణం చేసే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు,ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉందా అని సవాల్ విసిరారు.ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి కాంగ్రెస్ కోదాడ మండల అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే నాపై ఆరోపణలు చేయిస్తున్నారని వాపోయారు.వరప్రసాద్‌రెడ్డికి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంటే సీఎంఆర్ఎఫ్ కింద రూ.60 వేల నగదు మంజూరు చేయించానన్నారు.అనేక ఏండ్ల అనుభవం ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కనీసం తన భార్యకు కోదాడ నుండి కాంగ్రెస్ టికెట్ ఇప్పించుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆ ఒత్తిడిలో ఏం చేయాలో తెలియక బీసీ నాయకుడైన బొల్లం మల్లయ్యయాదవ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక మాలాంటి నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ బీఆర్ఎస్ ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారని త్వరలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు సలీం, శేషు, గీత, ప్రభాకర్, దళితబంధు లబ్దిదారులు పాల్గొన్నారు.

లింగయ్య సమాజానికి చేసిన సేవలు మరువలేనివి

నవతెలంగాణ-మోతె

మండలంలోని రాఘవపురం గ్రామ రేషన్ డీలర్ కోరిపెల్లి లింగయ్య సమాజానికి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అన్నారు.మంగళవారం మండలపరిధిలోని రాఘవపురం గ్రామంలో లింగయ్య ప్రథమవర్ధంతి నిర్మించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు.అనంతరం సైదులు మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన కొరుపెల్లి లింగయ్య ముఠామేస్త్రిగా జీవితాన్ని ప్రారంభించి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు.ఆనాడు గ్రామంలో చదువు అంటే ఉన్నవారికి మాత్రమే అందుబాటులో ఉండే ఆ రోజుల్లో చదువుకొని అనేక కష్టాలు అనుభవించి గ్రామంలో 30 ఏండ్లకు పైగా రేషన్ డీలర్‌గా పనిచేసి ప్రజల మన్ననలను పొందిన మహా వ్యక్తి అన్నారు.తన జీవితాంతం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేశారన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ సోమపంగు సూరయ్య, ఆర్ఐ మన్సూర్‌అలీ, సర్వేయర్ భాస్కర్,సీపీఐ(ఎం) గ్రామ కార్యదర్శి బూడిద లింగయ్య,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి భయ్యా నారాయణ, రిటైర్డ్ టీచర్ పజ్జూరి భిక్షం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మట్టిపల్లి రామ్మల్లు, బత్తిని రామన్న,దుశ్చర్ల కృష్ణ, డీలర్లు,వారి కుమారులు ఎస్సై కోరిపల్లి వినయ్‌కుమార్,మధు,విక్రమ్, కుమార్తై లక్ష్మీ, బంధువులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాల్సిందే



నవతెలంగాణ-సూర్యాపేట

ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డ్రైవర్లందరికీ సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూఅనుబంధం) జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వి.సాయికుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.సరుకులనుగాని, ప్రయాణికులను ఒక చోట నుండి మరొక చోటికి చేరవేయడంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు కీలకపాత్ర వహిస్తున్నారని తెలిపారు.అలాంటి వారికి, వారి కుటుంబాలకు భద్రతలేదన్నారు.ఆటో, లారీ, గూడ్స్, ట్రాక్టర్ డ్రైవర్లు రేయనక..పగలనక నిద్రాహారాలు మాని సుదూరప్రాంతాలకు సర్వీసు చేయడంలో డ్రైవర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు, మెకానికులకు, క్లీనర్ల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.ఇందుకుగాను ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు.ఈ సమావేశంలో ఎ.మల్లయ్య, కందుకూరి అంజయ్య, భద్రయ్య, మల్లేపాక సోమయ్య నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో అరుదైన దృశ్యం

- ఎస్సైగా క్యాన్సర్ బాధితురాలు ధరావత్ స్వాతి విధులు
- నెరవేరిన స్వాతి చివరి కోరిక

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని జగన్‌తండాకు చెందిన ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న స్వాతి చివరి కోరికను మంత్రి జగదీశ్‌రెడ్డికి తన చివరి కోరిక వెల్లడించడంతో స్వాతి ఆశయాన్ని నెరవేర్చాలని పోలీసులకు ఆదేశించడంతో మంగళవారం చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, సీఐ సోమనారాయణసింగ్, ఎస్సై విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



మెగాలోక్ అదాలత్‌లో సభ్యులుగా బాలకృష్ణ, నాగార్జున

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఈనెల 10వ తేదీన జరగబోయే మెగా లోకదాలత్ సభ్యులుగా కుక్కడపు బాలకృష్ణ,కమతం నాగార్జునను సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సభ్యులుగా నియమించినట్లు సీనియర్ సివిల్ జడ్జ్ జిట్టా శ్యాంకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మెగాలోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని కేసులలో వీరు కక్షిదారులకు సహకరిస్తారని తెలియజేశారు.ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు.




రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-మద్దిరాల

అసెంబ్లీ సాక్షిగా రైతులకు ఇచ్చిన రుణ మాఫీ హామీలను నిలబెట్టుకునే రైతు సంబురాలు జరుపుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కూజా ఎల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.నేటి వరకు రైతులు పండించిన వరి ధాన్యం నేటి వరకు కాంటాలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారున్నారు.రాబోయే ఎన్నికల్లో రైతులే ఈ ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

మున్సిపల్ భూముల వివరాలు పంపాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

సూర్యాపేట జిల్లాలో ఉన్న సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలో మున్సిపాలిటీకి ఇచ్చిన 10శాతం భూముల వివరాలను వెంటనే పంపాలని అడిషనల్ కలెక్టర్ ల్యాండ్ అకేషన్ ఆయా మున్సిపాలిటీలకు మంగళవారం ఆదేశాలు పంపారు. అదేవిధంగా ఈ వివరాల కాపీని మున్సిపాలిటీల నోటీసు బోర్డుపై ఉంచాలన్నారు.



డెక్కన్ సిమెంట్స్ కర్మాగారంలో పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-పాలకవీడు

మండలంలోని భవానిపురం డెక్కన్ సిమెంట్స్ కర్మాగారంలో యాజమాన్యం మంగళవారం పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది.జీరో ప్లాస్టిక్ పొల్యూషన్ దిశగా ప్రజలు మనుగడ కొనసాగించాలని, ప్లాస్టిక్ పొల్యూషన్ వల్ల జరిగే అపారనష్టాన్ని సిబ్బందికి వివరించింది.సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, సీజీఎం నాగమల్లేశ్వరరావు, మైన్స్ జీఎం చక్రవర్తి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, పరిశ్రమ సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.



రెండునిమిషాల్లో బీభత్సం

- కూలిన ఇండ్లు,చెట్లు,స్తంభాలు

నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని భీమ్లాతండాలో మంగళవారం రెండునిమిషాల విపరీతమైన సుడిగాలికి ఇండ్లు,చెట్లు,కరెంటు స్తంభాలు కూలిపోయి బీభత్సం సృష్టించింది. భోజ్యాతండాలో సైతం స్తంభాలు విరిగిపోయాయి.1994లో ఇదేరీతిన దొనదండ తాండాలో సుడిగాలికి దండా మొత్తం తుడుచుకు పెట్టుకుపోయింది.ఆనాడు గుడిసెలు కావడం నేడు డాబాలు కావడం వలన కరెంటు స్తంభాలు,రేకుల ఇండ్లు,చెట్లు మొత్తం నేలమట్టమయ్యాయని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండుతెలిపారు.ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.

మొగ్గయ్యగూడెంలో బీటీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని బండమీదిచందుపట్ల నుండి మొగ్గయ్యగూడెం వరకు నిర్మించనున్న బీటీరోడ్డుపనులను మంగళవారం సర్పంచ్ భూక్యా రాజ్యలక్ష్మీనాగునాయక్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సీఎం అయిన మాత్రమే తండాలు, గూడాలు పంచాయతీలుగా ఏర్పడి వెనుకబడిన గ్రామాల అభివృద్ధే తన ధ్యేయంగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు.రూ.3.20 కోట్లను బీటీరోడ్డుకు కేటాయించారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు ఉప్పలయ్య, వార్డుసభ్యులు మల్సూర్, మంజుల, ముత్తమ్మ, వెంకటేశ్వరరావు, వెంకట్రావు, భీమ్లా, వెంకన్న, రాజా, వీరభద్రయ్య, నారాయణరెడ్డి, మాధవరావు, అంజయ్య, పెదవాల్య, చక్రు, పులియా, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-కోదాడరూరల్

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షతులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని శాసనసభ్యులు బొల్లం మల్లయ్యయాదవ్ తెలిపారు.మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ మోతె మండల సీనియర్ నాయకులు అంకిరెడ్డి శ్రీనివాస్,గోగుల వెంకన్న బీఆర్ఎస్‌లో చేరారు.వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి భాస్కరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోదాడ పీఏసీఎస్ చైర్మెన్ ఆవుల రామారావు అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు రాయితీపై దీర్ఘకాలిక రుణాలు గేదేలు, గొర్రెలకు రూ. 52 లక్షల విలువైన చెక్కులను అందజేసి మాట్లాడారు.దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతులకు రుణాలు పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు.అదేవిధంగా పీఏసీఎస్ పరిధిలోని రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రైతులు పాస్ బుక్,ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రాయితీపై అందించే జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బుడిగం నరేష్, డైరెక్టర్ గుండపునేని ప్రభాకర్‌రావు, ఆడిటర్ ఆఫీసర్ రవి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపల్‌కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు దాత కందుకూరు లక్ష్మయ్య పుట్టినరోజు సందర్భంగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జలగంరామచంద్రన్, కార్యదర్శి శ్రీనివాస్, డాక్టర్ సురేష్‌కుమార్, సూర్యం, ఇమ్మడి వెంకటేశ్వర్లు, డాక్టర్ రమేష్, సుందర్, గిరిగౌడ్, కిట్టునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రిభువనగిరి
4
బుధవారం 07 జూన్ 2023

పారిశ్రామిక వాడలో దశాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ- భువనగిరి



తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పారిశ్రామిక వాడలో మంగళవారం పారిశ్రామిక ప్రగతి దినోత్సవం అదనపు కలెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో గత పాలకులచే తెలంగాణ ప్రజలు తీవ్రంగా నష్ట పోయారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక పరిశ్రమలలో ముందున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎస్ విజయ్ కుమార్ రెడ్డి. టీఎస్ఐఐసీ యాదాద్రి జోన్ ఎలక్ట్రికల్ జేఈ ఆర్ మహేందర్, భువనగిరి జిల్లా ఐలా ప్రెసిడెంట్ రాజాచారి, కార్యదర్శి చింత రవి ఐల కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

నవ తెలంగాణ-మోత్కూర్



మహిళ రెజర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ డిమాండ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో మంగళవారం మహిళ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మహిళా రెజర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటం క్రూరత్వమన్నారు. తమకు న్యాయం చేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మహిళల పట్ల బీజేపీ పెద్దలకు ఎలాంటి గౌరవం ఉందో ప్రపంచం మొత్తం గమనిస్తుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను భారత రెజింగ్ సమాఖ్య అధ్యక్ష పదవి, ఎంపీ బాధ్యతల నుండి తప్పించాలని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కందుకూరి అంజమ్మ, గుండు లక్ష్మి, అలివేల, శోభ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

నవతెలంగాణ-మోత్కూర్



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్ఎం రాజిడి రవీందర్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం 8వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించడానికి పేర్లు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు కె.అరుణాదేవి, కె.సౌజన్య, బి.లలిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ- భువనగిరిరూరల్

ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన రూ.272 ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్రలో భాగంగా గతంలో కూలీలకు పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, తాగడానికి మంచి నీళ్లు, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, పనిముట్లు ఇచ్చేవారని నేడు వాటన్నింటినీ ఎత్తేసిందన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజు రూ.100 నుంచి 150 దాటడం లేదన్నారు. ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు , ఉపాధి కూలీలు పుల్లెల శ్రీలత, పుల్లల ఇందిరమ్మ, కొండ బాలమణి, కొండమడుగు పద్మ కొండమడుగు కావ్య, వద్ది లక్ష్మి, రాంపల్లి చంద్రకళ, జక్కుల మంగ, మాకొల్ల స్వరూప, మెరుగు జయమ్మ, ఏశమైన మంజుల, మెరుగు పోచమ్మ మానుపాటి కళ్యాణి, గజ్జి లావణ్య, మెరుగు సుజాత, మీసాల లావణ్య, గుడ్డేలుగుల పద్మ కూకుట్ల మాధవి, గజ్జి కవిత, కే. లావణ్య, ధనమ్మ, అరుణ, సంతోష, మహేశ్వరి, కమలమ్మ ,గోపమ్మ , సోకమ్మ పాల్గొన్నారు.



బస్సు షెల్టర్ నిర్మాణం

నవతెలంగాణ - భువనగిరి

రోటరీ క్లబ్ భువనగిరి వారి ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్ పక్కన ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ ను నిర్మించారు. మంగళవారం తాళ్ల రాజశేఖర్ రెడ్డి గవర్నర్ బండారు శ్రీనివాసరావు అధ్యక్షులు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ అధ్యక్షులు సద్ది వెంకటరెడ్డి, ఎన్నిక గవర్నర్ శరత్ చౌదరి, కరిపే నర్సింగ్ రావు, కార్యదర్శి జ్ఞాన ప్రకాష్ రెడ్డి, సహాయక గవర్నర్ లింగారెడ్డి, శెట్టి బాలయ్య యాదవ్, బుచ్చిరెడ్డి, అశోక్ కుమార్, పడమటి జగన్ మోహన్ రెడ్డి ఆగేశ్వర్ మోహన్ రెడ్డి రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

భువనగిరి పట్టణం, బంజారాహిల్స్, విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, భువనగిరి ఫోర్ట్, భువనగిరి సెంట్రల్, గజ్వేల్ సెంట్రల్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు సబ్సిడీతో కూడిన రూ.13లక్షల విలువైన (185) కుట్టుమిషన్స్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కాట్రగడ్డ శరత్ చౌదరి ఎన్నిక గవర్నర్24-25, డా.ఎంపల్ల బుచ్చిరెడ్డి చైర్మెన్, మెంబర్‌షిప్ ఎక్స్టెన్షన్ తెలంగాణ రీజియన్, గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి అసిస్టెంట్ గవర్నర్, ఆయా క్లబ్స్ అధ్యక్షులు వరుసగా బండారు శ్రీనివాసరావు, మందడి వెంకటరెడ్డి, సద్ది వెంకటరెడ్డి, దీకొండ వెంకటేష్, కార్యదర్శులు కరిపే నర్సింగ్ రావు, వారాల రామకృష్ణారెడ్డి, పకీర్ కొండల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు వరుసగా శెట్టి బాలయ్య యాదవ్, దిడ్డి బాలాజీ, జిల్లాల కొండల్ రెడ్డి, ఎంపల్ల వెంకట్ రెడ్డి, గజ్వేల్ సెంట్రల్ కార్యదర్శి చెన్రాజు పండరి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటిక్యాల లావణ్య, రోటరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మండల దీక్ష

రాజాపేట:మండలంలోని రఘునాథపురం గ్రామాన్ని మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం 301వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకి రామిడి మోహన్ రెడ్డి, నీల బాలయ్య, బరేణి రాజు, నాలపక కర్నాకర్, అమరెందర్ , చల్లూరిచిన్నపోచయ్య, గంధమల్లవెంకటేశం , కలకుట్లకొమురయ్య , కటకంనగేష్ ,కటకంశివ, కొండంనర్సింహులు, కలకుంట్ల వెంకటేశం, కటకంప్రశాంత్, కటకంగణేష్ ,బల్లనరహరి గణపురంనర్సింహులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాడి పల్లి శ్రవణ్, ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, ఉపసర్పంచ్ పల్లె ప్రవీణ్, మాజీ సర్పంచ్ నరేందర్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లీ బోనాలు

భువనగిరి :పట్టణంలోని బార్‌పేట కోమటివాడలో ఉన్న పోచమ్మ తల్లీ బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికీ నైవేద్యం సమర్పించారు.ఈ కార్యక్రమంలో కాలేరు వినోద్, పొత్నాక్ ప్రమోద్ కుమార్. మాయ దశరథ, కాలేరు లక్ష్మణ్, సుర్వి శ్రీనివాస్, బచ్చు శ్రీనివాస్, నాగరాజు, పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం

నవ తెలంగాణ-తుర్కపల్లి

నకిలీ విత్తనాలు నమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిణి దుర్గేశ్వరి, ఎస్సై రాఘవేందర్ గౌడ్ తెలిపారు. మంగళవారం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా మండలంలోని గంధ మల్ల గ్రామంలోని మణికంఠ విత్తనాల షాపులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలను, ప్యాకింగ్ లేని లూజు విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం రికార్డులను ,సీడ్స్‌ను పరిశీలించారు.

తెలంగాణలో ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది

- డీసీసీబీచైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ -బొమ్మలరామరం



ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ బీజేపి పార్టీలకు లేదని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్‌కే ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓం శివ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు ఒక తెలంగాణలోనే ఉన్నాయన్నారు. పార్టీ ముందంజలో ఉంది కానీ ప్రచారంలో వెనక ఉన్నామన్నారు. తెలంగాణ తెచ్చింది ఇచ్చిందితామే అని మాటలు చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో గ్యాస్ ధర, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని ప్రజలు ఈవిషయాన్ని గ్రహిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు 100 సీట్లు రావడం ఖాయమన్నారు.తెలంగాణలో ఓటు అడిగే హక్కు ఒక బీఆర్ఎస్‌కేఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అటు అభివృద్ధి ఇటు సంక్షేమ పరుగులు పెట్టడమే గులాబీ శ్రేణులకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.తమ బలం.. బలగం మొత్తం గులాబీ సైన్యమన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు పార్టీ శ్రేణులలో జోష్ నింపుతున్నాయన్నారు. నాయకులు కార్యకర్తలు మధ్య ఆత్మీయ అనుబంధాన్ని, బలోపేతం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు కార్యకర్త ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు తాగునీటి రంగానికి లక్షల కోట్లు వెచ్చించి తెలంగాణ ప్రజలకు శాశ్వతంగా దాహార్తిని తీర్చిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలు కల్పించడంతో పాటు సాగునీటి రంగానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో పాటు సబ్సిడీ విత్తనాలు అందించి గిట్టుబాటు ధరతో ధాన్యాన్ని తెలంగాణ ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతు కళ్లల్లో సంతోషాన్ని చూస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,వైస్ ఎంపీపీ గొడుగు శోభ చంద్రమౌళి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కుషాంగుల సత్యనారాయణ, సింగల్ విండో చైర్మెన్ బాల్ నరసయ్య, వైస్ చైర్మెన్ కొండల్ రెడ్డి, అంజనేయులు,గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కదూవు ఉపేందర్ ముదిరాజ్, నాయకులు,రామిడి రాం రెడ్డి, మన్నె శ్రీధర్,మచ్చ శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డి, జూపల్లి భరత్, అశోక్ నాయక్,నవీన్ గౌడ,గణేష్, బీరప్ప,గోవిందు, శ్రీకాంత్, రాజన్,మల్లేశ్, సోషల్ మీడియా సాయికుమార్,వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



- వెంటనే డబ్బులు చెల్లించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

కొండమడుగు నరసింహ

నవతెలంగాణ -భువనగిరి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలలో నేటికీ నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వడపర్తి గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మార్కెట్‌కు ధాన్యం తెచ్చి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ఇంకా 20 శాతం మంది రైతుల వద్ద కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు చేసిన దాన్యం కూడా మిల్లర్లు వివిధ పేర్లు పెట్టి మూడు, ఐదు కిలోల చొప్పున కోత విధిస్తున్నారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు 20 రోజులు గడిచినా చెల్లించడం లేదన్నారు.ఆ పార్టీ మండల కార్యదర్శి, సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నరసింహ మాట్లాడుతూ వడపర్తి మార్కెట్లో 163 మంది రైతులు ధాన్యం మార్కెట్లోకి తెచ్చి రెండు నెలలు పైగా గడుస్తున్నా ఇంకా 40 మందికి పైగా రైతుల ధాన్యం నేటికీ మార్కెట్లో ఉన్నదన్నారు. కొనుగోలు చేసిన రైతులకు 20 రోజులు గడుస్తున్నా డబ్బులు రాకపోవడంతో మళ్లీ దున్నకాల సీజను ప్రారంభం అవడంతో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వడపర్తి గ్రామ శాఖ కార్యదర్శి పాండాల మైసయ్య, రైతులు మన్నే మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా పట్టి పేదల పక్షాన నిలిచిన వీరుడు ఎలుగల బాలయ్య

నవతెలంగాణ - ఆలేరుటౌన్



ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా పట్టి పేదల పక్షాన నిలిచిన వీరుడు ఎలుగల బాలయ్య అని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఇక్బాల్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బాలయ్య రెండవ వర్ధంతిని ఏసీరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో తమ వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీలు మారి ప్రయోజనాలు పొందుతున్న తరుణంలో కూడా జీవితాంతం తాను నమ్మిన సిద్ధాంతాన్ని కట్టుబడి మరణించేంతవరకు ఎర్రజెండాను చేతబట్టిన వీరుడు ఎలుగల బాలయ్య అన్నారు వారు యువజన సంఘం నుండి పార్టీకి ఆకర్షితులై దాదాపుగా 40 ఏండ్లుగా పార్టీకి పేద ప్రజలకు సేవ చేశారని వారు చేసిన సేవలను కొనియాడారు. పేద ప్రజల హక్కుల కోసం పోరాటమే బాలయ్య లాంటి వీరునికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మొరిగాడి రమేష్, పార్టీ నాయకులు ఘనగాని మల్లేష్ ,అజయ్, అంజయ్య ,లక్ష్మణ్ ,రాజు ,నాగరాజు ,మహేష్ ,, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరు మృతి
- రెండు వాహనాలు

నవతెలంగాణ -తుర్కపల్లి



టీవీఎస్ వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. కారు, టీవీఎస్ వాహనం రెండు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజపేట మండలం నమిలే గ్రామానికి చెందిన భువనగిరి మైసయ్య, ఎర్ర శంకరయ్య ఇద్దరు టీవీఎస్ వాహనంపై నమిలి నుండి వెంకటాపూర్ గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో హైదరాబాదు నుండి యాదగిరిగుట్టకు వెళ్తున్న ఎర్టిగా కారు ఢీకొట్టడంతో భువనగిరి మైసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ఎర్ర శంకరయ్యను భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించే సమయంలో మృతి చెందాడు. కారు, టీవీఎస్ వాహనం ఢీకొట్టడంతో కారు, టీవీఎస్ వాహనం రెండు పూర్తిగా చెలరేగి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలిసిన ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి మంటలు ఆరిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాఘవేందర్ గౌడ్ తెలిపారు.



సబ్బండ వర్గాల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

సంస్థాన్ నారాయణపురం:సబ్బండ వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు సికిలమెట్ల శ్రీహరి అన్నారు. మంగళవారం నారాయణ మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి మారుమూల గ్రామం అభివృద్ధి చెందిందన్నారు.నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై గ్రామంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రానున్న రోజుల్లో మరింత ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. సమావేశానికి హాజరైన కార్యకర్తల సలహా,సూచనలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ బిక్షం,మజీ సర్పంచ్ ఏర్పుల అంజమ్మపాశం కృష్ణ, వార్డు సభ్యులు బానోత్ బాలకిషన్,అందే యాదయ్య,ఉప్పల రాజయ్య,జక్కుల యాదయ్య,పాలకుర్ల సతీష్ గౌడ్,అంతటి ఇస్తారి,దూసరి వెంకటేష్ గౌడ్,ఎర్రోళ్ల లింగస్వామి,చిలువేరు శంకర్, చెరుకుపల్లి నారాయణ,గంజి వేణు, చిలువేరు అంజయ్య,బాలకృష్ణ, రాజు,యాదయ్య,నరసింహ, సికిమెట్ల ప్రభాకర్, చిలువేరు నరసింహ,కొప్పు రామకృష్ణ,చిలువేరు వెంకులు, గుండమల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు



- జన్మదిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం

నవతెలంగాణ -యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గం ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ముందుగా భువనగిరి రేణుక ఎల్లమ్మ ఆలయంలో కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి తెలంగాణ ప్రజలు అష్ట ఐశ్వర్యాలు సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బీర్ల నిలయంలో 150 మంది ఆలయ అర్చకులతో ప్రత్యేక వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆ తర్వాత మున్సిపల్ కార్మికులు బీర్ల ఐలయ్య కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రక్తదానం చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి బీర్ల ఐలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.









ఆలేరురూరల్ : మండలంలోని గొలనుకొండ గ్రామానికి చెందిన బీర్ల ఫౌండేషన్ సభ్యులు మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఐలయ్యకు శాలువాతో సత్కరించి షీల్డ్ బహుకరించారు.ఈ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ నియోజకవర్గం నాయకులు లగాని కుమార్ గౌడ్ ,ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు బంధారపు మధు గౌడ్ ,బీర్ల యువసేన నాయకులు భీమ గాని శ్రీనివాస్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బలంతుల అశోక్ ,పార్టీ నాయకులు తండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన్ రాజు వెంకటేశ్వరరాజు మంగళవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించారు అనంతరం స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గంధ మల్ల అశోక్, నాయకులు చాడ రాజు, సొంటెం మహేష్, రాజశేఖర్ ,రాజు, బండపల్లి మహేష్ ,రమేష్, కాటంరాజు, నవీన్ ,సురేష్ ,మధు, కనకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను పటేల్ గూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారికి గజమాలవేసి శాలువతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో కందడి రాజశేఖర్ రెడ్డి .ప్రకాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను ఎన్ఎస్ యు ఐ మండల అధ్యక్షులు సుంకరి విక్రమ్ మంగళవారం నిర్వహించారు .ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో ఘనంగా సన్మానించారు అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనవత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో బీర్ల ఫౌండేషన్ చైర్మెన్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలాగల రాజాయ్య,మండల ప్రధాన కార్యదర్శి చాడ భాస్కర్ రెడ్డి,ఎంపీటీసీ మోహనబాబు,సర్పంచ్ బిచ్చు నాయక్,జిల్లా ప్రధాన కార్యదర్శి డోంకేనా వెంకటేష్,కార్యదర్శి పవన్ రాజ్,బీసీ సెల్ మండల అధ్యక్షులు రామగోని వెంకటేష్ గౌడ్,ఎస్టీ సెల్ అధ్యక్షులు పట్టు నాయక్,ఎస్సీ సెల్ అధ్యక్షులు రఘు,మైనారిటీ సెల్ అధ్యక్షులు అసద్ భీ,మండల మహిళా శాఖ అధ్యక్షురాలు అయినాల చైతన్య మహేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా గధీ చౌరస్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చౌరస్తా నుండి వివేకానంద చౌరస్తా వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుట్ట నివాసంలో బీర్ల ఐలయ్యను శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు నమిలే మహేందర్ గౌడ్, సిల్వేరు బాలరాజ్ గౌడ్ ,మంచాల వీరేశం, బె డిదే నర్సింలు, సత్యనారాయణ, భూపతి యాదగిరి ,అంబాభాయ్ ,రాంజీ నాయక్ నవీన్ కుమార్, బాల మల్లేశం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిరూరల్ : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య పుట్టినరోజు కార్యక్రమంలో మండలానికి చెందిన నాయకులు పాల్గొని ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి నుచ్చు నాగయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సుక్క స్వామి, సిక్కుల వెంకటేశము, మండలం నాయకులు రమేష్, చిన్నం శ్రీనివాస్, చీమల కొండూరు గ్రామ శాఖ వెంకటేష్, చందుపట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు ఉపేందర్ లు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని టేకులసోమారం గ్రామంలో సాధన మానసిక వికలాంగుల ఆశ్రమం లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చేగురి మల్లేశం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి,పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నరగొని మురళి, చేగూరి వంశి రాజ్, మురళి,బాలక్రిష్ణ, నర్సింహా,వినయ్, సమీర్,నాని ,ప్రసాద్, ప్రశాంత్, భాను,లోకేష్,తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి వాట్సాప్ గ్రూప్ ఆపన్నహస్తం

నవతెలంగాణ-మోత్కూర్

మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ 2వ వార్డు జంగాల కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన కడమంచి రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబానికి మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ దాతలు ఆపన్నహస్తం అందించి అండగా నిలిచారు. ఆ కుటుంబానికి వాట్సాప్ గ్రూప్ సభ్యులు, దాతలు అందించిన రూ.23,716 ఆర్థిక సాయాన్ని మంగళవారం గ్రూప్ సభ్యులు కుటుంబ సభ్యులకు అందజేశారు. వాట్సప్ గ్రూప్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలబడటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల శిరీష శ్రీనివాస్, వాట్సప్ గ్రూప్ సభ్యులు దబ్బెటి సోంబాబు, గంధం శ్రీనివాసరావు, కారుపోతుల వెంకన్న, కోమటి మత్స్యగిరి ,మర్రి అనిల్ కుమార్ ,గాదే వెంకటేశ్వర్లు, ఇండ్ల రాంప్రసాద్, రమేష్, కోమటి జనార్ధన్ ,జంగ నర్సయ్య, పుల్కరపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమఫలాలు ప్రజల్లోకి చేరవేయాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 9 ఏండ్లలో రాష్ట్రానికి అందించిన సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి ధీరుబాయి సియాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్లో జరిగిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం 9 సంవత్సరాలు చేసిన సంక్షేమ పథకాల అభివృద్ధి గురించి వివరించారు. తెలంగాణలో బీజేపీని ఆదరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు సుధ గాని హరి శంకర్ గౌడ్ ,వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు పడాల శ్రీనివాస్ ,దాసరి మల్లేశం ,వేముల అశోక్ ,పడమటి జగన్ మోహన్ రెడ్డి ,నర్సింగరావు, నరేందర్, సముద్రాల కల్పన, సంగు భూపతి ,బడుగు జహంగీర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ బహూకరణ

నవతెలంగాణ-మోత్కూర్

మండలంలోని పాలడుగు గ్రామ పంచాయతీకి దాతలు బాడీ ఫ్రీజర్ బహూకరించారు. పాలడుగు గ్రామానికి చెందిన కందికట్ల రామచంద్రయ్య, భూలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు కందికట్ల వీరస్వామి, వెంకటేష్, గణేష్, నరేష్ మనుమరాళ్లు రూ.50 వేల విలువైన బాడీ ఫ్రీజర్ ను మంగళవారం గ్రామ పంచాయతీకి బహూకరించారు. బాడీ ఫ్రీజర్ బహుకరించిన దాతలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృతి

యాదగిరిగుట్టరూరల్:విద్యుద్ఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన యాదగిరిగుట్ట మండలంలోని కాచారంలో జరిగింది.బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుంపల దేశాయిరెడ్డి ఆవును షెడ్‌లో కట్టేసేందుకు తీసుకొస్తుండగా గాలిదుమారానికి కరెంటు తీగ తెగి ఆవు మీద పడడంతో మృతి చెందింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరారు.

వీవింగ్, డయింగ్ వర్క్‌షెడ్లకు నిధులివ్వాలని వినతి

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సిరిపురం గ్రామంలోని చేనేత కార్మికులకు ఉపయోగపడే విధంగా వీవింగ్ డయింగ్ వర్క్ షెడ్ ల నిర్మాణం కోసం సిరిపురం చేనేత సహకార సంఘానికి కోటి రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ సిరిపురం చేనేత సహకార సంఘం సలహా కమిటీ సభ్యులు పున్న వెంకటేశం మంగళవారం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. తప్పకుండా పరిశీలించి, నిధులు మంజూరు చేయడానికి కృషి చేయనున్నట్లు ఆయన సందర్భంగా హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట చేనేత వృత్తిదారులు పాలక కమిటీ సభ్యులు ఉన్నారు.

పిల్లలను చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

నవతెలంగాణ-మోత్కూర్

పిల్లలు లేని దంపతులు పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవచ్చునని, అనాథ పిల్లలను దత్తత తీసుకోవడానికి ఆన్ లైన్‌లో సంబంధిత వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారిని కవిత అన్నారు. మోత్కూర్ మండలం దాచారం గ్రామంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని, పిల్లలు లేనివారికి దత్తత ఒక మార్గమన్నారు. దంపతులు పిల్లల దత్తత కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి, దత్తత కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకునే అంశాలపై వివరించి అవగాహన కల్పించారు. దత్తత పేరుతో పిల్లలను అమ్మడం చట్టరీత్యా నేరమని, చట్ట విరుద్ధంగా పిల్లలను తీసుకొని ఆ తర్వాత చట్టపరమైన సమస్యలతో ఇబ్బంది పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీరాజ్యం, నర్మద, ఏఎన్ఎం కమురున్నిసా తదితరులు పాల్గొన్నారు.





సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డికి ఘనసత్కారం

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని వెల్లంకి గ్రామ పంచాయతీని జాతీయ స్థాయిలో పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా 2021-22 సంవత్సరంకు గాను రాష్ట్ర స్థాయిలో గ్రామ పంచాయితీ సమగ్రమైన స్వయం సమృది విభాగంలో అవార్డ్ కు ఎంపికైంది. దీంతో ఏప్రిల్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం పురస్కారంను ప్రధానం చేసింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మల్లికార్జున గార్డెన్స్ లో నిర్వహించిన విద్యుత్ విజయోత్సవం కార్యక్రమంలో ఎల్లంకి గ్రామ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డిని జెడ్పీచైర్మెన్ బండ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేకంగా వారు అభినందించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



నేటి చిత్రం...

ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు..

అలసి ... సొలసి.. రోడ్డు వెంట తోపుడు బండి పైనే నిద్ర.. రాజస్థాన్ రాష్ట్రం నుంచి పొట్ట చేత పట్టుకొని జ్యూస్ బండ్లు పెట్టి రోజువారి జీవనం గడిపే క్రమంలో అలసి ... సొలసి. జ్యూస్ బండి పై నిద్రపోతున్న ఛాయాచిత్రం నవతెలంగాణ కెమెరాకు చిక్కింది.ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు అని చూపిస్తుంది.

ఎండి.సాదత్ అలి నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-హాలియా

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటేనే భవిష్యత్తులో పేదవారికి విద్య అందుతుందని శ్రీనాథపురం గ్రామ సర్పంచ్ బొప్పని విజయ్‌కుమార్ అన్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతగూడెం ప్రధానోపాధ్యాయులు అబ్బిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చింతగూడెం పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గడ్డంశ్యాంప్రసాద్, ఎండి.పాషా, సాగర్లసత్తయ్య, దూసరిమధు, ఈగల లింగయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ్యత్వ బీమాచెక్కు అందజేత

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండల పరిధిలోని గోపరాజుపల్లికి చెందిన కోమటిరెడ్డి సైదులురెడ్డి కాటేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ సభ్యత్వ బీమా రూ.2లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కీసర్ల ఉపేంద్ర సత్తిరెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, పాశం మహేందర్ రెడ్డి వలిగొండ పట్టణ అధ్యక్షుడు ఎమ్మె లింగస్వామి, కంచనపల్లి మాజీ సర్పంచ్ గంగారం రమేష్, పోలేపాక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని నోటీసు

నవతెలంగాణ-ఆలేరురూరల్

మండలంలోని కొలనుపాక కలుగీత కార్మిక సహకార సంఘం ఎన్నికలు నిర్ణీత గడువులో అమలు చేయాలని ఎక్సైజ్ సీఐ దీపిక అన్నారు. మంగళవారం మండలంలోని కొలనుపాక కల్లుగీత కార్మిక సంఘం ఎలక్షన్ సంబంధించిన నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా మాటా డుతూ సంగం ఎన్నికలకు సంబంధించి ఎన్ని నోటీసులు ఇచ్చిన సంఘం నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. నిరీత గడువులోగా ఎలక్షన్ జరుపకపోతే సంఘం సభ్యత్వం రద్దు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ మల్లేష్ ,సంగం సభ్యులు కుమ్మరిండ్ల అంజయ్య, పాప రాజు, దూడల బాగులు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థులను సాధారణ పాఠశాలలో చేర్చుకోవాలి

- డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

హక్కుల చట్టం 2016 అమలు చేస్తూ అంధులైన బాల బాలికలను సాధారణ పాఠశాలలో చేర్చుకొని విద్యను అందించాలని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి ,ఏఐసీబీ కార్యదర్శి పొనుగోటి చొక్కా రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన 1999-2000 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హాజరై అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కు గురువులను ఆహ్వానించి సన్మానించి నందుకు ధన్యవాదాలు తెలిపారు 1983 నుంచి 2016 వరకు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా గెజిటెడ్ హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూ నల్లగొండ అంధుల పాఠశాల నిర్వాహకునిగా పూర్వ విద్యార్థులు ఆహ్వానించి నప్పుడు ఆ పాఠశాలకు వెళ్ళి అంధ బాల బాలికలు ఎక్కడ ఉన్నా మా నల్లగొండ అంధుల పాఠశాలలో చేర్చాలని చెప్పేవాడిని ఇప్పుడు నల్లగొండ అంధుల పాఠశాలలో విద్యార్థులు లేని కారణంగా పాఠశాలలను మూసివేయడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం ప్రతి డివిజన్ కు ఇద్దరు ఎమ్మార్టి ఉపాధ్యాయులను ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యను బోధించడానికి నియమిస్తుంది. అంధ విద్యార్థులకు ప్రవేశం ఇవ్వకపోవడం అనేది చట్టప్రకారం నేరం అవుతుందని కావున సాధారణ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో అంధులకు స్మార్ట్ ఫోన్స్ వాడకంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి ముఖ్యఅతిథిగా అమిత్ రెడ్డి ని ఆహ్వానించినట్టు తెలిపారు. డ్వాబ్ సంస్థ సేవలు నిరంతరం కొనసాగడానికి దాతలు ముందుకు వచ్చి అంధుల అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన రేవల్లి లక్ష్మమ్మకు రూ.15 వేలు, తుమ్మలపల్లి రవీందర్‌రెడ్డికి రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో రేవల్లి సర్పంచ్ హర్షిత గోపాల్‌రెడ్డి, తుమ్మలపల్లి విజయేందర్ రెడ్డి, తుమ్మలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, రేవెల్లి, గణేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

